శ్యామల పోయాక తల్లిదండ్రుల గురించి వాకబు చేశాడు. వాళ్ళు వేరే యింట్లో చేరలేదని, ఊరు వదలి వెళ్ళిపోయారని తెలిసింది.

★ ★ ★

“ఒరేయ్ మధూ నేను రవిని. నేనూ, నా భార్య నిన్నే కాశీకి వచ్చాము. ఇక్కడ మీ అమ్మానాన్నా కనిపించారు. శ్యామల పోయిన విషయం విని చాలా బాధపడ్డారు. వాళ్ళని నేను చూసిన విషయం నీకు చెప్పవద్దని మాట తీసుకొన్నారు. కానీ వాళ్ళ ఆరోగ్యం ఏం బాగా లేదురా. నన్నేం చేయమంటావు”

“అమ్మానాన్నా కనిపించారా?” ఆనందంతో అరచినంత పనిచేసాడు మధు. “రవీ నీవు వాళ్ళతోనే ఉండు. నేను నిన్నెక్కడ కలవాలో చెప్పు. నేను ఫ్లైట్‌లో ఎక్కైనా వచ్చి నిన్ను కలుస్తాను. నా ప్రాణాలిచ్చైనా సరే అమ్మానాన్నల్ని బ్రతికించుకొంటాను. రవీ దయచేసి వాళ్ళని చూస్తుండరా ప్లీజ్.”

మధు మనసు ఆనందంతో, ఉద్వేగంతో నిండిపోయింది. తన కన్నీళ్ళతో తల్లిదండ్రుల కాళ్ళు కడగటానికి, వాళ్ళ క్షమాభిక్ష కోరడానికి అతడు బయలుదేరుతున్నాడు.

**-సి.ఎన్.చంద్రశేఖర్ (చిత్తూరు)**

# అంచనా!

“అమ్మో... ఆవిడెవరే అంత నీరసంగా వాలిపోతూ నడుస్తుంది, ప్రపంచం లోని డల్‌నెస్ అంతా ఆమె మొహంలోనే ఉంది'' అన్నాన్నేను.

''ష్..ఆవిడ ఐ స్పెషలిస్ట్, అంతకుమించి గోల్డ్ మెడలిస్ట్'' నన్ను నెమ్మదిగా మాట్లాడమని వారిస్తూ చిన్నగా అంది సుమ.

''ఓహ్. అంత ట్యాలెంట్ ఆమెలో ఉన్నట్లు నాకు కనపడలేదే!''

''నీకు కనపడకపోతే ఆమెలో టాలెంట్ లేనట్లా?''

''నేను సైకాలజీ చేస్తున్నా తెలుసా, ఎవరి మొహం చూసైనా వారు ఎలాంటి వారో ఇట్టే చెప్పేయగలను!'' కించిత్తు గర్వంగా అన్నాన్నేను.

''ఆహా! అంత గొప్పదానివా నువ్వు?''

''నిజ్జం..నా అంచనాలెప్పుడూ తప్పలేదు. ఇప్పుడు ఈ డాక్టరమ్మ గురించి చెప్పనా..ఏదో చెయ్యాలి కదా అన్నట్లు చేస్తుందీ వృత్తి, సాయంత్రం పూట ఒక్క గంటే కదా ఆమె హాస్పిటల్‌కొచ్చేది, బద్ధకమెక్కువలా ఉంది!''

''నోర్ముయ్. అందరి గురించి బాగా కామెంట్స్ చెయ్యడం అలవాటైంది నీకు!'' మందలించింది సుమ నన్ను.

''సర్లే ఆవిడ గురించి కాకుండా నీ గురించి కామెంట్ చెయ్యనా?'' సరదాగా అన్నాను.

''అక్కర్లా, నా ఒ.పి. నెంబర్ పిలిచారు నేను లోపలికి వెళ్లొస్తాను. నువ్విక్కడే ఉండు!'' నా తల మీద ఓ మొట్టు మొట్టి లోపలికెళ్లింది సుమ.

ఆ ఐ స్పెషలిస్ట్ గురించి నేనన్న మాటలు త్వరలో వెనక్కి తీసుకోబోతున్నానని ఆ క్షణంలో నాకు తెలియదు!


సుమ నా ఫ్రెండ్. తనకు హాస్పిటల్‌కు తోడు రమ్మంటే వెళ్లాను. ప్రెగ్నెన్సీ చెకప్ చేయించుకొని వచ్చేసింది సుమ. ఇంటికెళ్లాం. నాన్న ఇంట్లోనే ఉన్నాడు. 'పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నావా లేదా అని ఇప్పుడు సుత్తేస్తాడు. బాప్‌రే ఎలా భరించాలో!' అనుకుంటూ లోపలికెళ్లాను.

నాన్నడిగారు సౌమ్యంగా ''ఎక్కడికెళ్లావ్'' అని. ఆ సౌమ్యం చూసి ధైర్యం వచ్చింది. బాగా తలెత్తి నాన్నకేసి చూడగలిగాను ''సుమకు హాస్పిటల్‌కి తోడెళ్లాను'' అని చెప్పాను.

''నాన్నమ్మకు ఐ చెకప్‌కు తోడు రమ్మంటే రానని చెప్పావుట. మీ అమ్మను వెళ్లమని చెప్పావ్, అమ్మకు తీరికెక్కడిది?''

'ఈ ముసలాళ్లతో వచ్చే చిక్కు ఇదే, నాన్నకప్పుడే నా మీద చాడీలు చెప్పేసింది మహాతల్లి!' అని అనుకుంటూ నాన్నమ్మ వైపు కోపంగా చూసాను.

''రేపు సెకెండ్ సాటర్ డే. గవర్నమెంట్ హాస్పిటల్‌లో ఫ్రీ చెకప్ ఆపరేషన్లు చేస్తున్నారట. ముందు



చెకప్ చేయించుకునిరా, ప్రాబ్లమ్ ఏమిటో తెలుస్తుంది'' ఆర్డరేసాడు నాన్న.

తిట్టుకుంటూ తలూపాను. మా సందు చివరే గవర్నమెంట్ హాస్పిటల్. మరుసటి రోజు ఉదయాన బామ్మను హాస్పిటల్‌కు తీసుకెళ్లాను. ఒ.పి. రాయించుకుని లోపలికెళ్ళేసరికి గుండె గుభేల్మంది అక్కడున్న జనాన్ని చూడగానే.

చాలాసేపు పడుతుందన్నమాట. బామ్మను చూసా, అప్పుడే పక్క పేషెంట్లతో మాటలు కలిపేసింది. వాళ్లంతా పల్లెటూరి జనంలా ఉన్నారు. ఆ మాటలు ఆ భాష..ఓహ్ గాడ్. బామ్మవైపు చిరాగ్గా చూసాను. ''వాళ్లతో నీకు మాటలేంటే'' అని కసిరాను.

''ఏదో టైం పాస్ లేవే!''

''నీ మూలంగా చూడు, ఈరోజు నేను ఈ హాస్పిటల్‌లో పడి ఉండాల్సి వచ్చింది. లేకపోతే మా ఫ్రెండ్ వాళ్లింట్లో ఈపాటికి సి.డిలో 'దిల్‌వాలే దుల్హనియా లేజాయేంగే' చూస్తూ ఉండేదాన్ని''

''ఆ మాటే మీ నాన్నతో చెప్పకపోయావా?''

''సర్లే..ఆ తర్వాత ఆయన చెప్పే నీతులకు నా తలకాయ పగిలిపోయుండేది!''

కాంపౌండరు దగ్గరకెళ్లాను. ''ఇంకా పదిమంది పేషెంట్స్ ఉన్నారమ్మా!'' అని చెప్పాడతను.

నీరసం వచ్చేసింది. అలా బైటికెళ్ళి అరగంట బజారువైపు చూసి మళ్లీ లోపలికొచ్చా. మళ్లీ వెయిటింగ్. ఇలా వెయిటింగ్ చేసి చేసి పేషెంట్స్ పక్కన వచ్చిన వాళ్లు కూడా పేషెంట్స్ అయిపోతారు. డామ్ ష్యూర్! బామ్మని చూస్తే ఒళ్లు మండింది. చిద్విలాసంగా చూస్తుంది నా వైపు.

''ఈసారి నన్నీ హాస్పిటల్‌కి తీసుకురా, చంపేస్తా!'' అన్నా బామ్మ వైపు చూసి.

''ఎందుకే అంత కోపం? వచ్చేసారి మీ అమ్మను తోడు తెచ్చుకుంటా లే!'' అనంది. నేనేదో అనబోతుంటే బామ్మ పేరు పిలిచారు. 'అమ్మయ్య!' అనుకుని లోపలికెళ్లాం. డాక్టర్ని చూడగానే త్రుళ్లిపడ్డాను. నేను 'నీరసం మొహం!' అని కామెంట్ చేసిన డాక్టర్.

చాలా ఓర్పుగా నేర్పుగా ఎంతమంది పేషెంట్స్‌ని టాకిల్ చేసింది?!

దాదాపు మూడు గంటల నుండి పేషెంట్స్‌ను ఎగ్జామ్ చేసినా అలసట లేని మొహం. బామ్మని థరోగా ఎగ్జామ్ చేసి మెడిసిన్స్ రాసిచ్చింది. బామ్మ అడిగిన చాదస్తపు ప్రశ్నలన్నిటికీ నవ్వుతూ జవాబిచ్చి సాగనంపింది.

మూడు గంటలు నేను ఊరికే కూర్చుని వెయిటింగ్ చేసినందుకే నాకు అలసిపోయినట్టనిపించింది. ఇక ఆ డాక్టరమ్మకెలా ఉండాలి? బామ్మలాంటి వాళ్లతో మాట్లాడి సమాధాన పరిచినందుకే ఆమెకు మంచి ఓర్పని మెచ్చుకోవచ్చు. గవర్నమెంట్ హాస్పిటల్‌లో మధ్యాహ్నం దాకా పనిచేసి ఈవెనింగ్ ఒక గంట తన భర్త హాస్పిటల్‌లో వర్క్ చేస్తుందట. ఆమెని నీరసం మొహం అని ఎగతాళి చేసినందుకు సిగ్గుపడ్డాను. మొహం చూసి అంచనాలు వేయడం తప్పని తెలుసుకున్నాను. ఇంకెప్పుడూ నేనెవరి గురించి చీప్‌గా మాట్లాడను!

**-కె.లలితారాజ్ (ఒంగోలు)**